క్లుప్తంగా

శ్రీమఠంలో పగలే ముగిసిన ఉత్సవాలు



రాఘవేంద్రుల మూల బృందావనం

మంత్రాలయం: చంద్రగ్రహణం సందర్భంగా రాఘవేంద్ర స్వామి మఠంలో శనివారం మధ్యాహ్నానికే ఉత్సవాలు ముగిశాయి. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆశీస్సులతో ఉదయం బృందావన స్వర్ణ పల్లకీ సేవ కానిచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు చెక్క, అంబారి, వెండి, బంగారు రథోత్సవాలు నిర్వహించారు. యాగ మండపంలో నవగ్రహ శాంతి హోమం గావించి ఉత్సవాలకు ముగింపు పలికారు.

రాజకీయ పార్టీలతో ఆర్వో సమావేశం

మంత్రాలయం: నియోజకవర్గంలోని పలు రాజకీయ పార్టీలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమ శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాలో ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు చంద్రశేఖర్, రుద్రగౌడ, ఆర్ఐ రాజశేఖర్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర, తదితరులు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో జీవించాలి

మంత్రాలయం: గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య సూచించారు. శనివారం బూదూరు గ్రామంలో ఎస్ఐ వేణుగోపాల్‌రాజుతో కలిసి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తూ ఉంటే 100 కి గానీ లేదా స్థానిక పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న నాయకులు

మంత్రాలయం: మంత్రాలయం గ్రామ దేవత మంచాలమ్మ ఆలయ పూజారి చెట్నేహళ్లి వీరేష్(33) గుండెపోటుతో శుక్రవారం మరణించిన విషయం తెలిసిందే. మృతుడికి వైఎస్సార్‌బీమా పథకం నమోదు కావడంతో తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును రాంపురం శేఖర్‌స్వామి, గ్రామ ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆదోనివాసికి జ్యోతిష్యంలో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న గరుడాద్రి దత్తాత్రేయశర్మ

ఆదోనిఅర్బన్: పట్టణానికి చెందిన జ్యోతిష్య పండితుడు గరుడాద్రి వెంకటదత్తాత్రేయశర్మకు ప్రపంచ మానవహక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శనివారం ఢిల్లీలో జరిగిన ప్రపంచ మానవహక్కుల పరిరక్షణ సభలో పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ హర్షవర్దన్, మదన్‌లాల్‌శర్మ, గోవింద చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నట్లు గరుడాద్రి దత్తాత్రేయశర్మ తెలిపారు. తెలుగు, సంస్కృతం భాషల్లో జోతిష్యంలో మాస్టర్ డిగ్రీని, తెలుగు పండిత శిక్షణను పూర్తి చేసుకొని లలిత సహస్రనామ స్తోత్రాన్ని, భౌతికశాస్త్ర ప్రాథమిక సూత్ర సమన్వయం చేస్తూ ఎంఫిల్ సాధించి జ్యోతిష్యంలో పీహెచ్‌డీ పూర్తి చేసినందుకు గానూ తనకు డాక్టరేట్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ఆర్‌టీఐ యాక్ట్ సమన్వయకమిటీ ఏర్పాటు చేయాలి



సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాగరాజుగౌడ్

ఆదోనిరూరల్: సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) 2005కు సంబంధించి డివిజన్ సమన్వయం కమిటీని ఏర్పాటు చేయాలని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగరాజుగౌడ్ కోరారు. శనివారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు.

మహోన్నతుడు వాల్మీకి మహర్షి

● మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి





52బసాపురంలో వాల్మీకి విగ్రహం వద్ద ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రత్యేక పూజలు, వాల్మీకి విగ్రహం వద్ద ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్

మంత్రాలయం: రామాయణ మహా కావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షి మహోన్నతుడని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం 52 బసాపురం గ్రామంలో నిర్వహించిన వాల్మీకి జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, చిలకలడోణలో టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి హాజరై.. వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వై.బాలనాగిరెడ్డి మాట్లాడుతూ వాల్మీకి సోదరులకు తాము అండగా ఉంటామన్నారు. మంత్రాలయంలో ఏర్పాటు చేయబోయే వాల్మీకి విగ్రహానికి టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి రూ 1.46 లక్షలు నగదును వాల్మీకి నేతలు డి.సి.తిమ్మప్ప, పులికుక్క రాఘవేంద్రలకు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు జి.భీమారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: వాల్మీకి జయంతి వేడుకలను మండల పరిధిలోని చిన్నతుంబళం, కల్లుకుంట, గవిగట్టు, పీకలబెట్ట, పెద్దకడబూరు తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి విగ్రహ ఊరుగింపులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన బస్టాండ్ ఆవరణంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు విజయేంద్రరెడ్డి, వాల్మీకులు పాల్గొన్నారు.

కౌతాళం: మండల కేంద్రంతో పాటు నదిచాగి, రౌడూరు, సులేకేరి, కుంటనహల్, బదినేహాల్, గోతులదొడ్డి, ఉరుకుంద తదితర గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వాల్మీకులు ఘనంగా నిర్వహించారు. కౌతాళంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదచారి, ఉప సర్పంచ్ తిక్కయ్య, తోవి గ్రామ ఇన్‌చార్జ్ నర్సప్ప, సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, నాయకులు రాజ్‌హమ్మద్, సమద్, పూజారి లింగ, రామాంజి, వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.



కౌతాళంలో పూజల్లో పాల్గొన్న మండల అధ్యక్షుడు, నాయకులు

కోసిగి: వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని కడపాళెం ఆంజనేయ స్వామి ఆలయంలో వద్ద నుంచి వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని వైఎస్సార్ సర్కిల్ వరకు ఊరేగింపు నిర్వహించారు. అక్కడ వాల్మీకి మహర్షి విగ్రహానికి పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి హాజరయ్యారు. కందుకూరులో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేయనున్న వాల్మీకి మహర్షి విగ్రహ వద్ద విగ్రహ ప్రతిష్ఠాపన హోమాలు చేపట్టారు. పూజలకు హాల్వి మఠం పీఠాధిపతి మహాంతేష్ స్వామి హాజరయ్యారు.



కందుకూరులో వాల్మీకి విగ్రహం ఏర్పాటు హోమ పూజల్లో పాల్గొన్న హాల్వి మఠం పీఠాధిపతి మహాంతేష్ స్వామి

వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి

ఆదోని టౌన్/సెంట్రల్/అర్బన్: వాల్మీకి మహర్షిని వాల్మీకులు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ సూచించారు. శనివారం వాల్మీకి జయంతి సందర్భంగా 1వ వార్డు బోయగేరిలో వాల్మీకి మహర్షి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణ అధ్యక్షుడు దేవా, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మిల్టన్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రమేష్‌బాబు, సీఈఓ వెంకటేష్, కె.సుశీల, జయసింహ, కృష్ణా, ఉమర్, నయిమ్ తదితరులు పాల్గొన్నారు.



చిలకలడోణలో వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న వై.సీతారామిరెడ్డి



కోసిగిలో వాల్మీకి విగ్రహ పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి



పూజలో పాల్గొన్న వాల్మీకులు



పెద్దకడబూరులో వాల్మీకి విగ్రహం ఊరేగింపులో పాల్గొన్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

ప్రశాంతంగా జీవించండి



మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోనిరూరల్: గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతమైన జీవనాన్ని గడపాలని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. శనివారం మండలంలోని చిన్నపెండేకల్ గ్రామంలో తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చిన్నచిన్న విషయాలకు గొడవలు పెట్టుకుని కుటుంబాలను నాశనం చేసుకోరాదన్నారు. సమస్యలను గ్రామపెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. పిల్లలను చదివించడంలోనూ, ఆర్థికంగా రాణించడంలోనూ పోటీ పడాలన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న గర్జప్పను అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. గర్జప్ప నుంచి 120 (90 ఎం.ఎల్.) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

ఏపీ ఎంసెట్ మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఆదోని సెంట్రల్: ఏపీ ఎంసెట్ మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ శనివారం కోరారు. మొదటి, రెండు విడతలో జరిగిన కౌన్సెలింగ్‌లో 77 శాతం మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయని, ఇంకా 27,590 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మూడవ కౌన్సెలింగ్ నిర్వహిస్తే దాదపు 13 వేల మంది విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు.

ఉద్యోగమేళా కరపత్రాలు విడుదల



ఉద్యోగమేళా కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: ఉద్యోగమేళా కరపత్రాలను శనివారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తన స్వగృహంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణశాఖ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నవంబర్ 3న ఉద్యోగ మేళా ఉంటుందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, ఎంబీఏ, బీటెక్ చదివిన వారు అర్హులన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారికి 17 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకి రూ.10 వేలు నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

త్వరలో భూగేని చెరువుకు ట్రైల్ రన్

కోసిగి: మండల ప్రజలకు తాగునీటి సమస్యను శాస్వతంగా పరిష్కారం చేసే దిశగా ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సొంత నిధులతో చేపట్టిన భూగేని చెరువు స్టోరేజీ ట్యాంక్‌కు పైప్‌లైన్ ద్వారా త్వరలోనే ట్రైల్ రన్ చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన పైప్‌లైన్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులికనుమ నుంచి కోసిగి ప్రాంతానికి తాగు, సాగునీటిని అందించేందుకు చేపట్టిన పైప్ లైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఇది వరకే రిజర్వాయర్ సమీపం నుంచి నాకన్న చెరువు వరకు సాగునీటి పైప్‌లైన్ పూర్తి చేయించినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో భూగేని చెరువులోకి తాగునీటిని విడుదల చేసేందుకు అధికారులతో చర్చించి ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్రైల్ రన్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, మాజీ సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటర్ అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు, ఉరుకుంద ట్రస్ట్‌బోర్డు సభ్యులు బుల్లి నరసింహులు, బండ్ల గోవిందు, నరసింహులుగౌడ, దొడ్డి నరసన్న, వారం ఈరన్న పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులు పరిశీలించిన వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి

నాడు –నేడు పనులను త్వరగా పూర్తి చేయాలి

ఆదోని సెంట్రల్: నాడు – నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రంగారెడ్డికి శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం సమర్పించారు. నాడు – నేడు పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం వడ్డించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, శశిధర్, పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ రంగారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దారిలేక వరిమళ్లలో అంత్యక్రియలకు వెళ్తున్న గ్రామస్తులు



కనరో కాటి కష్టం

మంత్రాలయం: కాటి కష్టానికి ఆ గ్రామం కన్నీరు పెడుతోంది. అంత్యక్రియలకు ఎనలేని ఆపసోపాలు పడుతోంది. శ్మశాన వాటికకు దారి లేక పరమ దారిద్ర్యాన్ని అనుభవిస్తోంది. మంత్రాలయానికి 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న చెట్నహళ్లి గ్రామంలో తరతరాలుగా కాటి కష్టాలు వెంటాడుతున్నాయి. శనివారం గ్రామానికి చెందిన మంచాలమ్మ పూజారి వీరేష్ గౌడ్ గుండెపోటుతో మృతి చెందాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామస్తులు పడరాని పాట్లు పడ్డారు. వరిమళ్లలో నడుచుకుంటూ అంతిమ యాత్ర కొనసాగించారు. ఈ దృశ్యం గ్రామస్తులను కలిచివేసింది. మృతిడికి భార్య విజ్జమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

●ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



వైద్య శిబిరం గురించి వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం శంకర్‌నగర్, ఎస్‌కేడీ కాలనీలో పర్యటించి అర్దగేరి బసవన్నగౌడ్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. శిబిరంలో అందుతున్న వైద్యసేవలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పలువురు డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలు అందించి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం, ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు అందిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, చైర్‌పర్సన్ బోయ శాంత, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, కౌన్సిలర్ వీరభద్రారెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ మధుసూదన్‌శర్మ, వార్డు ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: మండలంలోని బసరకోడు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో వైద్యులు నిసిగ్రేస్, వై.శేఖర్, మహేష్ పాల్గొని 593 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఫార్మాసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్‌లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మంత్రాలయం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ మణిమంజరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జి.భీమారెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, ఉపసర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ వెంకటేష్ శెట్టి, నాయకులు గోరుకల్లు కృష్ణ స్వామి, తదితరులు ఉన్నారు.

కోసిగి: కోసిగి మండలంలోని సాతనూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో సాతనూరు, తుంబిగనూరు, సాతనూరు కొట్టాల గ్రామానికి చెందిన 325 మందికి డాక్టర్ రజిత ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగమ్మ, ఎంపీహెచ్ఈఓ ఎల్లప్ప, శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ కృపానందం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.





బసరకోడులో ప్రజలకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు, సాతనూరులో వైద్య పరీక్షలు చేయిస్తున్న వైద్యాధికారులు

రైతుల్ని ఆదుకోండి

కౌతాళం: తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మించి రైతుల్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య అన్నారు. తుంగభద్ర నదిపై మేళిగనూరు వద్ద వరద కాలువ నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆటో జాతా చేపట్టారు. శనివారం రెండవ రోజు మండలంలోని ఉప్పరహాల్, కుంటనహాల్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కరువు ఛాయాలు అలుముకున్నాయని, ఎల్ఎల్‌సీ నీరు డిసెంబర్ వరకు అందిస్తేనే పంటలు వస్తాయని, లేకపోతే దిగుబడి రాక నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈనెల 30న సీపీఎం ప్రజా రక్షణ భేరీ బస్సు యాత్ర ఆదోని నుంచి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వనర్ ఈరన్న, నాయకులు ఉలిగయ్య, వీరేష్, సత్యప్ప పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఎమ్మిగనూరు రూరల్: వాంతులు, విరేచనాలతో బాధ పడుతూ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు కోలుకోలేక శనివారం మృతిచెందాడు. వివరాలు.. మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన తెలుగు వెంకన్న, పద్మావతిల ఏకైక కుమారుడు గోవర్దన్(18). తల్లిదండ్రులు తెలంగాణకు వలస వెళ్లటంతో గ్రామంలోనే గోవర్దన్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల నుంచి వాంతులు, విరేచనాలు అవుతుండటంతో మందులు వేసుకుని ఇంట్లోనే ఉన్నాడు. తగ్గకపోవడంతో పాటు శనివారం మరింత తీవ్రం కావడంతో స్థానికులు గోవర్దన్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. కుమారుడి మృతి చెందిన విషయాన్ని గ్రామస్తులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వా మి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.



పూజలందుకుంటున్న స్వామి వారు

సమస్యలు పరిష్కరించండి

ఆదోని సెంట్రల్: కొన్నేళ్లగా పెండింగ్‌లో ఉన్న పురపాలక ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, ఆర్థిక కార్యదర్శి కోటన్న డిమాండ్ చేశారు. శనివారం ఎంటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎంటీఎఫ్ నాయకులు దస్తగిరి, నూర్ ఉల్ హక్, ఆనంద్ ప్రతాప్ రెడ్డి, మద్దయ్య, మహేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేపడుతున్న సందర్భంగా డీ1, డీ3 సెక్షన్‌లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీ నాగేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదు సబ్‌స్టేషన్ లైన్లు ఎస్‌కేడీ కాలనీ, రాంజల వద్ద, హనుమాన్‌నగర్, బైపాస్ రోడ్డు వద్ద, ఇండోర్ వద్ద ట్రీ బ్రాంచెస్ కటింగ్ మరమ్మతు పనులు ఉంటాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు. పట్టణంలో 60 శాతం వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలన్నారు.

మూడోరోజు కొనసాగిన జీపుజాతా

ఆదోనిరూరల్: ఈనెల 30న ప్రజారక్షణభేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలో చేపట్టిన బస్సు యాత్ర మూడో రోజుకు చేరుకుంది. శనివారం మండలంలోని ఢణాపురం, చాగి, నారాయణపురం, నాగనాథనహళ్లి, బసాపురం, ఇస్వీ, కడితోట, ఎడవలి, జి.హొసళ్లి, హానవాల్, పెద్దహరివాణం, చిన్నగోనేహాల్, చిన్నహరివాణం, మదిరె గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శివర్గ సభ్యులు డి.రామాంజనేయులు మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో దోని నుంచి విజయవాడ వరకు నిర్వహిస్తున్న యాత్ర అక్టోబర్ 30వ తేదీన ఉదయం 10 గంటలకు ఆదోని పాత బస్టాండు శ్రీనివాస్‌భవన్ దగ్గర ప్రారంభమవుతుందన్నారు. ఈ బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండలకమిటీ సభ్యులు బి.తిక్కప్ప, చిన్నతిక్కన్న, రామప్ప, భీమాంజనేయులు, అనీఫ్‌బాషా, చక్రవర్తి, అంజి తదితరులు పాల్గొన్నారు.